క్లుప్తంగా

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధికార ప్రతినిధిగా సురేంద్ర



పీలేరురూరల్ : జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధికార ప్రతినిధిగా పీలేరుకు చెందిన పోలిశెట్టి సురేంద్రను నియమిస్తూ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు సుంకర చిన్న రెడ్డిబాబు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ జాతీయ చేనేత ఐక్యవేదిక ద్వారా చేనేత కార్మికుల పరిరక్షణ కోసం, వారి సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. పోలిశెట్టి సురేంద్ర మాట్లాడుతూ తన నియామకానికి సహరించిన జాతీయ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

రాయితీపై జొన్న విత్తనాల పంపిణీ



గడ్డి విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రైతులకు ప్రభుత్వ రాయితీపై గడ్డి జొన్న విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జి వెటర్నరీ డాక్టర్ విక్రంరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలానికి ఏడు టన్నుల విత్తనాలు మంజూరయ్యాయని, ఐదు కిలోల బ్యాగు రూ.90ల చొప్పున అందజేస్తున్నామన్నారు. పీటీఎం, కందుకూరు, మద్దయ్యగారిపల్లి, రంగసముద్రం, బూర్లపల్లి, తుమ్మరకుంట గ్రామాల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు ఆధార్ కార్డుతో విత్తనాలు పొందవచ్చని డాక్టర్ తెలిపారు.

దండు మారెమ్మకు ప్రత్యేక పూజలు



దండుమారెమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

కురబలకోట : మండలంలోని ముదివేడు దండు మారెమ్మ తిరునాలను తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి బుధవారం సందర్శించారు. అంతకు ముందు ఆయన స్థానిక మండల, గ్రామ నాయకులు వెంట రాగా అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు సుఖ శాంతులతో, రైతులు పాడి పంటలతో బాగుండాలని అమ్మవారిని వేడుకున్నారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆయనకు ఈ సందర్భంగా ప్రత్యేక ఆహ్వానం పలికారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కూలీలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

పీలేరు : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. బుధవారం పీలేరు పట్టణ పరిసర ప్రాంతాల్లో ఇటుకబట్టీల కూలీలకు ఆరోగ్య విద్య కార్యక్రమం నిర్వహించారు. వేసవి సందర్భంగా వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సీటీఎం పంచాయతీకి 5.76 లక్షల ఆదాయం

మదనపల్లె : మండలంలోని సీటీఎం వారపు సంతలో గేటువసూళ్లకు సంబంధించి బుధవారం నిర్వహించిన బహిరంగ వేలంలో పంచాయతీకి రూ.5.76లక్షల ఆదాయం లభించినట్లు డీఎల్‌పీఓ నాగరాజు తెలిపారు. వేలంలో మహమ్మద్, అన్వర్‌బాషా, చాంద్‌బాషా, బాబాషరీఫ్, మునికృష్ణలు పోటీపడగా, రూ.5.76 లక్షలకు మహమ్మద్ వేలం దక్కించుకున్నాడు. గత ఏడాది రూ.2లక్షల5వేలు పలికిన వేలం పాట ఈ ఏడాది రూ.3లక్షల71 వేలు అధికంగా పలికింది. కార్యక్రమంలో సర్పంచ్ ఆనందపార్థసారధి, వెలుగుచంద్ర, ఈఓఆర్డీ షుకూర్‌సాబ్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

ములకలచెరువు : రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొనడంతో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు... ములకలచెరువుకు చెందిన రామూర్తి(55) పనుల మీద తన ద్విచక్రవాహనంలో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం రైల్వేగేటు మలుపు వద్ద వేగంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో రామూర్తికి తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు బెంగళూరు మణిపాల్ హాస్పెటల్‌కు తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూముల రీసర్వే వేగవంతం చేయండి

సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్



రైతులు, అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

పెద్దతిప్పసముద్రం : భూముల రీసర్వేను వేగవంతం చేయాలని మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ సర్వే టీంను ఆదేశించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన మండలంలోని కంసలవాండ్లపల్లి రెవెన్యూ విలేజ్‌లో చేపట్టిన రీసర్వే విధానాన్ని తనిఖీ చేశారు. ఈ గ్రామ పరిధిలో ఎన్ని ఎకరాలు ఉన్నాయి, రోజుకు ఎన్ని ఎకరాల సర్వే పూర్తి చేస్తున్నారు.. ముందస్తుగా ఎంత మంది రైతులకు నోటీసులు ఇస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. గ్రామ పరిధిలో మొత్తం 1433.5 ఎకరాల భూములు ఉండగా ఇప్పటి వరకు 911 ఎకరాల్లో సర్వే పూర్తి చేసామన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ 30 మందికి తగ్గకుండా రైతులకు నోటీసులు ఇవ్వాలని, ప్రణాళికా బద్ధంగా రోజుకు 20 ఎకరాలకు తగ్గకుండా సర్వే పూర్తి చేయాలన్నారు. వివాదాస్పద భూములు ఉంటే ఆర్‌ఎస్‌డీటీ ద్వారా పరిష్కారం అయ్యేలా చూడాలని ఆదేశించారు. పట్టా భూములు వివాదంగా ఉంటే కోర్టు ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. సిబ్బంది కొరత, పని తీరు, ఇంటి పట్టాల రీవెరిఫికేషన్, పీజీఆర్ఎస్ పెండింగ్ ఫైళ్ళను గ్రామాల వారీగా అడిగి తెలుకున్నారు. రెవెన్యూ సిబ్బంది అలసత్వాన్ని విడనాడాలని, ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా రికార్డులను క్షుణంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని సబ్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీరాములు నాయక్, మండల సర్వేయర్ శ్రీవాణి, డీటీ ధనంజనేయులు, ఆర్ఐ బాలాజీతో పాటు వీఆర్వోలు, సర్వే టీం సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీకి రూ. 13.49 లక్షల ఆదాయం



నిమ్మనపల్లి వారపుసంతలో బహిరంగ వేలం నిర్వహిస్తున్న అధికారులు

నిమ్మనపల్లె : బహిరంగ వేలం ద్వారా నిమ్మనపల్లె పంచాయతీకి రూ.13,49,400 లక్షల ఆదాయం సమకూరినట్లు డీఎల్‌పీఓ నాగరాజ తెలిపారు. బుధవారం స్థానిక వారపు సంత ఆవరణలో సర్పంచ్ పాపులమ్మ ఆధ్వర్యంలో వారపు సంత, బస్టాండ్ గేటు, పంచాయతీ దుకాణ గదులకు కార్యదర్శి వెంకటరమణారెడ్డి వేలం నిర్వహించారు. వారపు సంత గేటు రూ. 7.50 లక్షలకు చింతపర్తికి చెందిన హేమంత్ కుమార్ రెడ్డి దక్కించుకున్నారు. బస్టాండ్ గేటు రూ.1.41 లక్షలకు నిమ్మన పల్లెకు చెందిన రమణయ్య దక్కించుకున్నారు. 8 పంచాయతీ షాపింగ్ రూములకు ఏడాది కాలానికి వేలం ద్వారా రూ.4,58,400 లక్షల ఆదాయం సమకూరిందన్నారు. మొత్తంగా 2025-2026 ఆర్థిక సంవత్సరానికి నిమ్మనపల్లె పంచాయతీకి గేటు వేలం ద్వారా పెద్ద మొత్తంలో ఆదాయం సమకూర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ చలపతిరావు, ఏఓ రమేష్ బాబు, మల్లప్ప, సచివాలయ కార్యదర్శి రాజేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కురబలకోట ఇన్‌చార్జి ఎంపీపీగా ఎంజి భూదేవి

- ఆరు నెలల సెలవులో ఎంపీపీ దస్తగిరి
- మండల రాజకీయాల్లో కొత్త మలుపు



కురబలకోట : మండల రాజకీయాల్లో ఒక్కసారిగా ఊహించని కొత్త మలుపు చోటు చేసుకుంది. వైఎస్సార్ సీపీ ఎంపీపీగా ఉన్న బి. దస్తగిరి ఆరునెలల సెలవు కోరుతూ ఆయనే స్వయంగా చిత్తూరు జెడ్పీ సీఈఓను కలసి బుధవారం లెటర్ ఇచ్చారు. ఇన్‌చార్జి ఎంపీపీగా ప్రస్తుత వైస్ ఎంపీపీ ఎంజి. భూదేవికి బాధ్యతలు అప్పగించాలని అందులో కోరారు. ఎవ్వరూ ఊహించని విధంగా ఎంపీపీ బి. దస్తగిరి ఈ సెలవు నిర్ణయం తీసుకోవాల్సిరావడం సంచలనంగా మారింది. అనారోగ్య కారణాలతో బాధ్యతలు నిర్వర్తించలేక తాను సెలవులో వెళుతున్నట్లు తెలిపారు. దీంతో వైస్ ఎంపీపీ ఎంజి భూదేవి ఇన్‌చార్జి ఎంపీపీగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి ఆదేశాలతో గురువారం బాధ్యతలు చేపడుతున్నట్లు తెలిపారు. గురువారం వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హాజరవుతున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీపీగా భూదేవి బాధ్యతలు చేపట్టనుండడం మండల రాజకీయాల్లో కీలక మలుపు కానుందని భావిస్తున్నారు.

ప్రజల సహకారంతో క్షయవ్యాధి నివారణ



క్షయవ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రామకృష్ణ

తంబళ్లపల్లె : ప్రజలు సహకరించినప్పుడే క్షయవ్యాధి నివారణ సాధ్యమవుతుందని టీబీ సూపర్‌వైజర్ రామక్రిష్ణ తెలిపారు. బుధవారం కన్నెమడుగు ఉన్నత పాఠశాలలో క్షయవ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. రెండువారాలు మించి దగ్గు రావడం, ఆకలి లేకపోవడం, క్రమేణ బరువు తగ్గడం, సాయంకాలం జ్వరం రావడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులలో గల్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. ఈ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆ రోగికి ప్రతి నెలా రూ.1000 ఆరు నెలల పాటు రోగి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారన్నారు. ఉచితంగా మందులు ఇస్తారన్నారు. టీబీ వ్యాధి నిర్ధారణ అయిన ఇంటిలోని వారికి ముందస్తు జాగ్రత్తలతో పాటు వ్యాధి సోకకుండా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సరిత, ఆశాలు పాల్గొన్నారు.

ఎంఐజీ లేఅవుట్‌కు భూసేకరణ



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ధనంజయులు

మదనపల్లె : మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఎంఐజీ లేఅవుట్ భూసేకరణకు సంబంధించి తహసీల్దార్ ధనంజయులు బుధవారం పోతబోలు పంచాయతీలో పర్యటించారు. పంచాయతీలోని 13మంది రైతులకు చెందిన 28 ఎకరాలను రెవెన్యూ అధికారులు ఎంఐజీ లేఅవుట్‌కు ఎంపిక చేయడంతో తహసీల్దార్, రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరను వారికి తెలుపుతూ, న్యాయమైన పరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. రైతులు తమ భూములకు ఏ ధర కోరుతున్నారో చెపితే, ఉన్నతాధికారులకు నివేదిక పంపి న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానన్నారు.

మాలల సింహగర్జనకు తరలిరండి

కలికిరి : ఈ నెల 23న ఆదివారం తిరుపతిలో నిర్వహించనున్న రాయలసీమ మాలల సింహగర్జన కార్యక్రమానికి పెద్ద ఎత్తున మాలలు తరలిరావాలని మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్టీడి హరి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఎస్టీ రమణ పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాలలో బుధవారం పర్యటించిన వారు అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన రాజ్యాంగ వ్యతిరేక ఎస్సీ వర్గీకరణ క్రిమిమిలేయర్ తీర్పును రద్దు చేయాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్ 20శాతానికి పెంచాలని డిమాండ్‌లతో మాలల సింహగర్జన జరుగుతుందని, ప్రతి మాల బిడ్డ తమ వంతు బాధ్యతతో సమావేశానికి హాజరై విజయవంతం చేసి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు మండల అధ్యక్షుడు భానుప్రకాష్, నాయకులు విజయ్‌కుమార్, సహదేవ, మేస్త్రీ రామ, గురు, శీన, రెడ్డెయ్య, ప్రతాప్, గంగాధర, రమణ, ధనయ్య, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితో ఆలయ నిర్మాణం పూర్తి



నిర్మాణ పనులు పూర్తయిన ఆలయం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కాట్నగల్లులో పురాతన కాలం నాటి శ్రీచెన్నకేశవ స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. ఈ విషయాన్ని గతంలో పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు గణపతిరెడ్డి, సందీప్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కుమార్‌రెడ్డిలు గ్రామస్తులతో కలసి నూతన ఆలయ నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిని కోరారు. సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే ఆలయ నిర్మాణంకు రూ.40 లక్షల నిధులను గతంలో మంజూరు చేయించారు. ఈ తరుణంలో ఆలయ నిర్మాణ పనులు పూర్తి కావడంతో నూతన శోభతో సంతరించుకుంది. గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

'పది' పరీక్షలకు 11 మంది గైర్హాజరు

కలికిరి : మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన పదవ తరగతి సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ కరీముల్లా తెలిపారు. స్థానిక బాలికోన్నత పాఠశాల కేంద్రంలో 209 మందికి 207, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 196 మందికి 192, మహల్ పరీక్ష కేంద్రంలో 110 మందికి 105 మంది హాజరయ్యారని ఎంఈఓ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం మండల పరిధిలోని చింతపర్తి పంచాయతీ తాళ్ళపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మోహన్ రెడ్డి తండ్రి ముసర వెంకట శివారెడ్డి ఇటీవల మృతి చెందాడు. బుధవారం ఆయన దశదిన కర్మ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరై ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఇదే గ్రామం కోటపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అప్పిరెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డి సోదరుడు రామక్రిష్ణారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న సమాచారం మేరకు ఆయన్ను పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఉపాధి సిబ్బంది బదిలీ

పెద్దమండ్యం : పెద్దమండ్యం ఉపాధి హామీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కార్యాలయంలో ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న మురళిని చిన్నమండ్యం ఏపీవోగా బదిలీ చేశారు. అలాగే టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సోముశేఖర రెడ్డి కురబలకోటకు, గంగాధరను చిన్నమండ్యంకు, బిఎఫ్‌టీగా విధులు నిర్వహిస్తున్న భూదేవిని తంబళ్లపల్లెకు బదిలీ చేశారు. కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న శైలజను కలకడ ఉపాధి హామీ కార్యాలయానికి బదిలీ చేశారు.

ముదివేడు జాతరకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : కురబలకోట మండలం ముదివేడు దండుమారెమ్మ జాతరకు గురువారం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డీపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి ముదివేడుకు 25 బస్సులు, తంబళ్లపల్లె నుంచి ముదివేడుకు రెండు బస్సు సర్వీసులు నడుపుతామన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

రేపు అటవీశాఖ ఉద్యోగులకు శిక్షణ

బి.కొత్తకోట : జిల్లా అటవీశాఖ అధికారులు, ఉద్యోగులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని హార్సిలీహిల్స్‌పై నిర్వహిస్తున్నారు. జిల్లాకు చెందిన రాజంపేట డీఎఫ్ఓ జగన్నాథ్‌సింగ్, సబ్‌డీఎఫ్ఓలు, రేంజర్లు, సెక్షన్ ఆఫీసర్లు, బీటు అధికారులు, సహాయ బీటు అధికారులు హాజరవుతున్నారు. వీరికి వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర అటవీశాఖకు చెందిన ఉన్నతస్థాయి అధికారులు హాజరవుతున్నారు. కార్యక్రమం కోసం అటవీశాఖ ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆదరణ పథకంపై అవగాహన

తంబళ్లపల్లె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం బీసీ కులాల చేతివృత్తులు, కులవృత్తులవారికి ఆదరణ పథకం ద్వారా పరికరాల పంపిణీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి బీసీ కులాలలోని చేతి వృత్తులు నిర్వహించుకునే వారికి ప్రభుత్వం అత్యాధునిక పనిముట్ల కిట్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. బీసీ కులాల సంఘాల నాయకులతో అత్యాధునిక పరికరాల విషయమై సూచనలు, సలహాలు తీసుకున్నారు. అత్యాధునిక పరికరాల కోసం నివేదికలు పంపడం జరుగుతుందన్నారు. సమావేశంలో కార్యాలయ ఏఓ థామస్, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఫిత్రా రూ.90

మదనపల్లె సిటీ : రంజాన్ మాసంలో పండుగ ముందు నిరుపేదలకు చెల్లించాల్సిన ఫిత్రా రూ.90 నిర్ణయించినట్లు ప్రభుత్వఖాజీ మహమ్మద్ జలాలుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిత్రాదానం ఆయా కుటుంబాల ఆర్థిక పరిస్థితుల ఆధారంగా దానం చేయాలన్నారు. అందులో 1.7 కిలోల గోధుమలు దానం చేయడం, ఆర్థిక స్తోమత ఉన్నవారు బార్లీ 3.5 కేజీలు, ఎండు ఖర్జూరం 3.5 కిలోలు, ముడున్నర కిలోల ఖర్జూరం ఒక్కొక్కరు చెల్లించాలన్నారు. పుట్టిన పురిటి బిడ్డ నుంచి ప్రతి ఒక్కరు దీన్ని విధిగా నిరుపేదలకు దానం చేయాల్సి ఉందన్నారు. రంజాన్ పండుగ ప్రత్యేక నమాజ్ ఆచరించే ముందు దీన్ని నిరుపేదలకు అందించాల్సి ఉంటుందన్నారు.

ఆదరణ-3 పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి



కులసంఘాల నాయకులతో డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి

మదనపల్లె : బీసీల చేతివృత్తులకు సహకారం అందించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆదరణ-3 పథకంను అర్హులు సద్వినియోగం చేసుకునేలా కులసంఘాల నాయకులు చొరవ చూపాలని డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని బీసీ కులసంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ అమరనాథ రెడ్డి మాట్లాడుతూ...ఉమ్మడి రాష్ట్రంలో బీసీల చేతివృత్తులకు సహకారం అందించేందుకు అమలు చేసిన ఆదరణ పథకాన్ని 2014-19 మధ్య ఆదరణ-2 పేరుతో మళ్లీ అమలుచేసి 140 కులవృత్తులలోని 4లక్షల మందికి 90శాతం సబ్సిడీతో పనిముట్లు, యంత్రాలను అందించడం జరిగిందన్నారు. ప్రస్తుతం బీసీల చేతివృత్తులకు 90శాతం రాయితీతో వృత్తి పరికరాల కొనుగోలుకు ఆదరణ-3 పథకాన్ని రాష్ట్రప్రభుత్వం తిరిగి ప్రారంభిస్తోందన్నారు. కులసంఘాల నాయకులు తమ తమ కులాల్లో పనిముట్లు, యంత్రాలు అవసరమైన లబ్ధిదారులను గుర్తించి, వారితో పథకానికి దరఖాస్తు చేయించి లబ్ధి పొందేలా చొరవచూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసు నమోదుచేయాలి

సీపీఐ నాయకుల డిమాండ్



అలివేలమ్మను పరామర్శిస్తున్న సీపీఐ నాయకులు

మదనపల్లె : ఎస్టీ మహిళ అలివేలమ్మపై దాడిచేసిన నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అలివేలమ్మను పరామర్శించారు. దాడికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అలివేలమ్మ మాట్లాడుతూ..గుర్రంకొండ మండలం ఎల్లుట్ల పంచాయతీ శీలంవారిపల్లెలో ఎస్టీ ఎరుకుల కులానికి చెందిన తాను నివసిస్తున్నట్లు తెలిపింది. తాను పెంచుకుంటున్న కుక్కపిల్లను ఎందుకు కొడుతున్నారని అడిగినందుకు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు విచక్షణా రహితంగా దాడిచేయడంతో పాటు కులం పేరుతో దూషించి, తీవ్రంగా గాయపరిచారంది. అడ్డుకోబోయిన తన కోడలినిపైన దాడిచేశారని చెప్పింది. దాడిచేసిన వారిపై కేసు నమోదుచేయమని పోలీసులను ఆశ్రయిస్తే వారు పట్టించుకోలేదని వాపోయింది. దాడిచేసిన వ్యక్తులు అలివేలమ్మను ఊరికి రానివ్వమని, మాపైనే కేసు పెడతావా, నీకు ఎంత ధైర్యం..నువ్వు ఎలా ఊరిలో బతుకుతావో చూస్తామని బెదిరిస్తున్నారని చెప్పింది. పోలీసులు నిందితులను అరెస్ట్ చేయకుండా తాత్సారం చేస్తుండటంతో వారు మరింత బరితెగిస్తూ బెదిరిస్తున్నారని వాపోయింది. దీంతో ఆమె దుస్థితిని చూసి చలించిపోయిన సీపీఐ నాయకులు, గిరిజన మహిళపై దాడి చేసిన నిందితులపై హత్యాయత్నం కేసు నమోదుచేసి తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కృష్ణప్ప, సాంబశివ, మురళీ, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివనారాయణ



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివనారాయణ

మదనపల్లె : బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివనారాయణ, జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా సంస్థాగత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలోకేష్ మాట్లాడుతూ జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యకర్తలు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేతలు బీజేపీ నాయకులను, కార్యకర్తలను విస్మరించడం సరికాదన్నారు. అందరూ కలిసికట్టుగా ప్రజా సమస్యలపై ఉద్యమించాలన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంఘటన మంత్రి జి.మధుకర్, జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్‌లను బీజేపీ వాల్మీకిపురం మండల అధ్యక్షులు జాకీర్‌హుస్సేన్, కలికిరి మండల అధ్యక్షులు కుమార్‌రెడ్డి దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై కార్యాచరణ



మాట్లాడుతున్న కమిషనర్ పల్లవి

బి.కొత్తకోట : పట్టణంలో ప్రజల నుంచి వసూలు కావాల్సిన పన్నుల కోసం కార్యాచరణ ప్రణాళిక ద్వారా కృషి చేయాలని కమిషనర్ జీవీ.పల్లవి అన్నారు. బుధవారం కమిషనర్ కార్యాలయంలో ఐదు సచివాలయాలకు చెందిన ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బకాయిలు, ప్రస్తుత పన్నులు రూ.2.60 కోట్లు వసూలు కావాల్సివుండగా ఇప్పటిదాక రూ.98 లక్షలు మాత్రమే వసూలైందని అన్నారు. సచివాలయాల పరిధిలో ప్రజల నుంచి ఆస్తి, ఇంటి, నీటి పన్నుల వసూలు కోసం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. నెలాఖరుకు మొత్తం బకాయిలు వసూలయ్యేలా కృషి చేయాలని కోరారు. గురువారం ఆదరణ పథకం ద్వారా పనిముట్లు అందజేసేందుకు కులసంఘాల పెద్దలను ఆహ్వానించి వివరాలు తెలుసుకోవాలని కోరారు.

పాలసీదారులపై భారం తగ్గించాలి



ధర్నా చేస్తున్న లియాఫీ నాయకులు

రాజంపేట టౌన్ : జీవిత బీమా పాలసీదారులపై భారం తగ్గించాలని లియాఫీ రాజంపేట శాఖ అధ్యక్షుడు ఏవీ సుబ్బయ్య, కార్యదర్శి ముద్దా శంకర్‌రెడ్డి తెలిపారు. సమస్యల పరిష్కారానికై ఎల్ఐసీ ఏజెంట్స్ యూనియన్ ఢిల్లీలో చేపడుతున్న మహాధర్నాకు మద్దతుగా బుధవారం లియాఫీ ప్రతినిధులు స్థానిక ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలో శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలసీదారులకు బోనస్ పెంచాలని, ప్రీమియంపై జీఎస్టీ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సరెండర్ వ్యాల్యు సవరించాలని, మినిమమ్ పాలసీ లక్ష రూపాయలు చేయాలని, క్లా బ్యాక్ క్లాజ్ ఎత్తివేయాలని తెలిపారు. యాజ మాన్యం స్పందించి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. యాజమాన్యం సమస్యల పరిష్కారంపై అలసత్వం వహిస్తే ఆందోళనను ఉధృతం చేయనున్నట్లు తెలిపారు.

